# బంచరాయి

ఆరేడొందల వరకు కడపలు వున్న ఆ వూళ్లో ఎక్కువ మంది కూలి నాలి మీద ఆధారపడి బ్రతుకుతున్న వారే. నిజాముల పాలన ఎన్నో ఏండ్ల క్రితం అంతమైనా వాళ్ల ప్రతినిధులు రామిరెడ్డి పటేలు రంగారావు దొర ఇంకా బ్రతికేవున్నారు.

ఎంతో పెద్ద గుడిని కట్టించగలిగిన ఆ పెద్ద మనుషులు బడిని గురించి పట్టించుకోకపోవడం వల్ల ఆ వూరికి హైస్కూలు కూడ రాలేక పోయింది. అందుకనే ఆ వూరి బాలురు ఏడవ తరగతి కంటే ఎక్కువ

చదవలేకపోతున్నారు. రావు గారి పిల్లలు, పటేలు పిల్లలు మాత్రమే పట్టణంలో చదువుతున్నారు.

రహదారి నుండి వూళ్లోకి రోడ్డులేదు. బస్సు రాదు. ఉన్న బండ్ల బాట కూడ సరిగలేని కారణాన ప్రభుత్వ అధికారులెవ్వరు ఆ వూరికి రానేరారు.

ప్రభుత్వం మిగులు భూములను హరిజనులకు పంచాలంటుంది. ఆ ఊళ్ళో ముప్పది ఎకరాల బంచరాయి రోడ్డు ప్రక్కమ్మటే ఉంది. దాని మరో ప్రక్కన పడావు పడ్డ దేవాలయము, చుట్టూర తాటిచెట్లు. ''ఆ భూమి దున్నుకుంటాము'' అంటున్నారు ఆ గ్రామ హరిజనులు. ''అబ్బె వీలులేదు'' అంటున్నారు దొర, పటేలు, మరి ఇతర భూస్వాములు.

''ఏదో ఓట్ల కోసం కాని, లేకపోతే వాళ్ల కెందుకివ్వాలంట?'' పటేలు.

''భూమినిస్తే ఓట్లు వేస్తారా? ఎవడు ఆ రోజు కల్లు సారకిస్తే వానికే!'' దొర.

''అయినా బంగారంలాంటి ఈ భూమిని వాళ్లకు ఇవ్వటం ఏమిటి, ఏ సవుళ్ళో చూపిస్తే పోవ'' పటేలు.

''సౌళ్లలేవు, వల్లకాడు లేదు అసలు వాళ్లకు భూ మెందుకంటా? గొడ్డు గోదా లేని సన్నాసులు, వాళ్లేమి పండించి చస్తారు? ఒక వేళ ప్రభుత్వం ఇచ్చినా ఎన్నాళ్లు! మళ్లీ ఏ నొప్పికో, ఏ రోగానికో లేదా పెళ్లికో కాకుంటే తాగుడుకో కుదువ పెట్టరూ? ఆ తర్వాత తీసుకున్న డబ్బు కట్టలేక మనకు అంటకట్టక మానరు''.

బంచరాయి చెలకలో హరిజనులు చెట్టుకొడుతున్నారని తెలిసి ఆపడానికి వెళ్ళుతున్నారా మహానుభావులు. వారి వెనక ఊళ్ళో జనాన్ని కులాల వారిగా లేపు కొస్తున్నాడు మస్కూరి మాదన్న.

''భూమిలేని పేదవాళ్లకు మిగులు భూమిని పంచాలి అన్నే కదా ప్రభుత్వం ప్రకటించింది. పేద వాళ్లు అన్ని కులాలలోనూ ఉన్నారు. మరి వాళ్ల మాటేమిటి, వీళ్లకు భూమి కావాలి-'' రామిరెడ్డి చెపుతూ పోతున్నాడు. కరణం హఠాత్తుగ ఆగి, రామిరెడ్డిని రెక్క పట్టి దగ్గర లాక్కొని ''ఈ మాట అక్కడ వాళ్ల ముందు అనేవుగట్టు. వాళ్లూ మాకు కావాలని కూర్చొంటారు.''

''అందర్కి కాస్త కాస్త యిప్పిస్తే రేపు పంచాయతీ ఎన్నికల్లో నాకు తప్పక ఓటు వేస్తారు అని-'' రామిరెడ్డి.

''నీ ఓటు పాడుగాను, నీకు ఎన్ని ఓట్లు కావాలో నా మీద వదలి పెట్టు. నేను చూసుకుంటా. ముందు ఈ భూమిని ఎవ్వరిపాలు కాకుండా చూడు. రోడ్డు ప్రక్కల భూమి. ముందు ముందు ధర పలుకుద్ది. రేపు మన పిల్లలకు ఏ ఉద్యోగము దొరకక్కపోతే, ఏదైనా ఇండస్ట్రీ, ఆఖరికి ఓ కోళ్ల ఫారమైనా పెట్టొచ్చు. లేదా కొన్నాళ్లాగి ప్లాట్స్ చేసి అమ్మితే పైసలే పైసలు.'' కర్ణం తన ప్లాను బయట పెట్టక తప్పలేదు.

''ఇదిగో రామిరెడ్డి, ఎన్నికల్లో నిన్ను గెలిపించే భారం నాది. ఈ విషయంలో మాత్రం నా మాట ఔనను, నేను అన్ని చూసుకుంటా'' ''సరే పదా'' అంటూ ఇద్దరూ బంచరాయి చెలుక వైపు నడిచారు.

అప్పటివరకే ఇంటికో మనిషి చొప్పున దాదాపు అరవై మంది దాక హరిజనులు చెట్టు కొడుతున్నారు. వాళ్ల పిల్లలు, ముసలివాండ్లు

ఆ చెత్త నంతా ఒక్క చోటికి చేరుస్తున్నారు. వాళ్ళ ఆడవాళ్ల సద్ది గంపలతో వచ్చి, వాటిని గెట్ల మీద పెట్టి చెత్త కుప్పలకు నిప్పంటిస్తు న్నారు.

కరణం. రామిరెడ్డి యిద్దరు గెట్టు చేరేసరికి మస్కూరి వూరందరిని లేపుకొచ్చాడు. అందరు గెట్టు మీద నిలుచున్నారు. అంతవరకు చెత్తను కూడేస్తున్న ముసలి వాళ్ల కరణానికి, రామిరెడ్డికి నెత్తి రుమాళ్లు తీసి దోసిలి పట్టుకొని వంగి దండం పెట్టారు.

''ఏం పాపిగా, ఎవరిని అడిగి ఈ భూమిలో చెట్టుగొడుతుండ్రురా''

''అదేంది దొరా అందరి కెరుకనాయె, రామిరెడ్డి పటేలు గూడ దున్నుకొమ్మనే.''

''మా గోపాల్-అదే రాజిగాని కొడుకు పట్నంలో హాస్టల్లో చదువు కుంటుండు. అడు తహశీలు దొరను అడిగి వచ్చిండట'' అందరిలోకెల్ల పెద్దవాడు మల్లయ్య నసిగాడు.

''పటేలు దున్నుకొమ్మనడం, మీరు దున్నటం, మరి తహశీలు దొరేమన్న పట్టా యిచ్చిండ ? ముందు అందర్ని పని ఆపి ఇక్కడకు రమ్మను''

''మంచిది దొర! అరే ఓరి లింగయ్య, రంగయ్య, లచ్చయ్య. ఆ పుర్రి వాని పని ఆ పుర్రి. అందరు యిటు రార్రి. దొర ఏదో చెపు తాడట'' అని అందరిని పిలిచాడు మల్లయ్య.

అందరు వచ్చాక ''ఏడి ఆ రాజిగాని కొడుకెక్కడ ?'' కరణం.

''అడు సమితి ప్రసిడెంటును కలిసొస్తానని పోయిండు, యింకా రాలేదు.'' మల్లయ్య.

''ఆ ప్రసిడెంటు మిమ్ముల్ని ఈ వూర్ని అమ్మేబాపతు. ఆయన మీకేమి ఒరగ పెడతాడ్రా సన్నాసుల్లార. రేపు ఎలక్షన్స్ వస్తున్నయని ఓ ఎత్తు వేశాడంతే.'' దొర.

''అయినా తరతరాల నుండి ఈ గూడెంలో ఎప్పుడు సాలు పెట్ట లేదు. కొంద్ర ఎయ్యను లేదు. ఇయ్యాల్ల మీరుగొసి పెట్టినాద్ర దీన్ని దున్నడానికి.''

కుడిచేత్తో దోతి కొంగు పట్టుకుని ఎడమ చేతితో వాళ్ళను, భూమిని చూపిస్తూ, వెటకారం నిండిన గొంతుతో అంటున్నాడు దొర.

''మంత్రులొచ్చినప్పుడు ఏదో మాట్లాడుతుంటారు. మనవాళ్లు వాళ్ళ తోక పట్టుకుని గోదావరి ఈదుతాం అంటారు'' రామిరెడ్డి.

''చెప్పరేమిరా- మీ వూరందరికి యిష్టమేనా వీళ్లు దీనిని దున్ను కోవడానికి?'' కరణం అందరిని గద్దిస్తూ ప్రశ్నించారు. నెత్తి నవున్న గొంగళిని సంకలోకి కూర్చుకొని, పొడగాటి కర్రను అసరాగ పెట్టుకొని గొర్లు జివాలు, అటు ఇటు తిరిగొచ్చి కాస్త నిలబడకుండ ఊరి ప్రక్కన వున్న ఈ కాసింత భూమిని మీరు దున్నుకుంటే ఎట్లైద్ది - మరి మేనెటు పోవాలె'' అంటు అడిగాడు వూరి పెద్ద గొల్ల బీరప్ప.

''అవును, అవును. ఈ మాట నిజం. పొలం తిరిగొచ్చి పశువులు పొద్దుగూకంగ కాసింత సేపు నిలబడడానికి జాగలెకపోతే ఎట్లా?'' అన్నారు రైతులు.

చాకలి చౌడుకోసం, కుమ్మరి మన్ను కోసం, ఊరన్నప్పుడు కొంత భూమన్న కాలిగా ఉండాలన్నారు.

అప్పుడేవచ్చినఆవూరిపూజారి-

''ఇక దేవాలయం ఎన్నాళ్లు అలా పాడుపడి వుంటుంది, దానికి మోక్షం లేదా ? ఏదో ఆ దేవుడి పేర ఈ భూమిని పట్టా చేయిస్తే ఎవరన్న మహానుభావులు సేద్యం చేసి పెడితే, గ్రామప్రజల తరఫున ఇంత దీపారాధన చెయ్యొచ్చు. ఈ విషయంగూడ కాస్త ఆలోచించండి'' అని ఓ దమ్ము నశ్యం పీల్చి నశ్యం అంటిన వేళ్ళనుత్తరీయానికి తుడుచు కొన్నాడు.

అన్ని విన్న కరణం, పటేలు గుస గుస మాట్లాడుకొని "ఏది ఏమైనా పూజారి చెప్పినది వినదగ్గది. మనమందరం తగు ఏర్పాట్లు చెయ్య వల్సింది గూడ. ఏ మంటారు?'' అందరివైపు చూస్తు.

''మేము మాత్రం ఎలా కాదంటాము? దేవుడికి దీపారాధన వద్దంటామా?'' అన్నారు అందరు.

హరిజనులు తప్ప మిగతా కులాలవాళ్లు అందరు సరేనని, ఆ భూమిని దున్నొ వద్దని హరిజనులకు మరిమరి చెప్పి వెళ్లిపోయారు.

ఏం చేయాలా తట్టక కాలుతున్న కుప్పలను వాటిని ఎగేస్తున్న పిల్లలను చూస్తు నిలుచున్నారు.

• • •

హరిజనులు భూమిని దున్నారు.

హరిజనులు దున్నిన నాగలి చాలులో ఓ దేవుడి విగ్రహం బయట పడింది. ఆ విగ్రహం దగ్గర పూనకం వచ్చిన స్త్రీ కొల్పు చెప్పతోంది. ఆమె చుట్టూరా జనం.

"ఈ భూమి దేవుడిది, అందుకని తరతరాల నుండి దీన్ని ఎవ్వరు ఆక్రమించలేక పోయారు. ఒకవేళ ఎవ్వరైనా అలాంటి ప్రయత్నంచేస్తే దాని ఫలితం తీవ్రంగా వుంటుంది'' అని పూనకం వచ్చిన అమ్మవారు చెప్పింది. ఆ మాటలనే దొరగారు వూరంత చాటింపు చేయించాడు.

రకరకాల మాటల మధ్య అంతు పట్టని అనుమానాల మధ్య ఆ దినం గడిచింది.

అర్ధరాత్రి దాటినాక హరిజన వాడ తగులబడుతున్న మంటలు. తట్ట, బుట్ట, చంటి పిల్లల్ని చంకనెత్తుకొని, ముదుసలి వాళ్ళ రెక్క పట్టుకుని గుడిసెల్లో నుండి బయట పడి, తమ సర్వస్వం మంటల పాలై పోతుంటే చూస్తు ఏడుస్తున్నారు.

అన్ని పూరి గుడిసెలే. అందరు నిద్రనుండి లేసి, తాడు, బొక్కెన అనే లోపలనే మంటలు అంటుకున్నవి.

ఎన్ని ప్రయత్నాలు చేసిన మంటలేమి అదుపులోకి రావటంలేదు. కోడిపిల్లలు, మేక పిల్లలు మొదలగు వాళ్ళ ఆస్తి అంత క్షణంలో బూడిద అయింది. వూళ్ళో వాళ్ళందరు మంటల్ని ఆపే ప్రయత్నం ఎంతో చేశారు. కాని ఆపలేక పోయారు.

హరిజనవాడ పూర్తిగా తగలబడి పోయిలది.

దొర, పటేలు కర్మ సిద్ధాంతాన్ని విప్పి చెప్పుతున్నారు. దేవుడి భూమిని, దేవతా విగ్రహాన్ని కదుల మన్నినందుకే హరిజన వాడ తగల బడ్డదని పూజారి అన్నప్పుడు "ఔను" అన్నాడు. దొర "నిన్న కొలుపులో చెప్పినది నిజమైనది!" అన్నాడు పటేలు

"కాదు - అంతా అబద్ధం" అని గోపాలం అరిచినప్పుడు జనం అంతా అతని చూపులవైపు, చూపుడువేలు వైపు చూస్తున్నారు.